క్లుప్తంగా

శంకరాచారికి విశ్వకర్మ లెజెండరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న శంకరాచారి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నారోజు శంకరాచారి విశ్వకర్మ లెజెండరీ అవార్డు అందుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు పద్మశ్రీ అవార్డు గ్రహీత, స్థపతి వేలు ఆనందాచారి, తల్లోజు ఆచారి అవార్డు ప్రదానం చేసినట్లు శంకరాచారి తెలిపారు. వివిధ రంగాల్లో సేవచేస్తున్న వారిని గుర్తించి ఏటా విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ అవార్డులు ప్రదానం చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ పలు సేవా కార్యక్రమాలతో పాటు నా గమ్యం ఐఏఎస్ పుస్తక రచనతో సివిల్స్ రాసే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసినందుకు అవార్డుకు ఎంపిక చేశారన్నారు. అవార్డు అందుకున్నందుకు శంకరాచారిని ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, మిత్రులు, గ్రామస్తులు అభినందించారు.

శంకరయ్యకు నంది పురస్కారం



డాక్టర్ శంకరయ్యను సన్మానిస్తున్న ప్రతినిధులు

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ వి.శంకరయ్య సోమవారం నంది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ చేసిన వారికి మెగా ఎంటర్‌ప్రైజెస్ ఏటా నంది పురస్కారాలు ప్రదానం చేస్తోందన్నారు. గతంలో గ్రామీణ ప్రజలు కరోనా బారిన పడకుండా 27 గ్రామాల్లో తిరుగుతూ అవగాహన కల్పించానన్నారు. కోహెడ హైస్కూల్ స్కూల్ విద్యార్థులకు మాస్కులు, శానిటైజర్ స్టాండ్ అందించడంతో మెగా ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ శిరీషరెడ్డి చేతుల మీదుగా బిర్లా భాస్కర్ ఆడిటోరియంలో నంది పురస్కారం అందుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ ప్రతినిధులు విశాల శ్రావణ్‌రెడ్డి, అనుప్రసాద్, భాస్కర్, నటులు రవి శివతేజ, కిరణ్, మధుబాబు, రుద్ర శ్రీనివాస్ పాల్గొన్నారన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోండి

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో ప్రభుత్వ భూముల కబ్జాపై రెండేళ్లుగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 12, 921 సర్వే నంబర్లల్లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఆ భూములను కొలిచి హద్దులు నిర్ణయించాలని అఖిలపక్ష నాయకులు కోరినా సర్వేయర్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సర్వే నంబర్ 12లో కోట్ల విలువ చేసే భూమి అన్యాక్రాంతమైందని, 627 సర్వే నంబర్‌లో ఎకరంన్నర ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూములపై సర్వే చేయించి కాపాడాలన్నారు.

పాడిఆవు మృతి

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ షాక్‌కుగురై పాడి ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధి లోని కడవేర్గులో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జంగ లావణ్య తన పాడిఆవును మేత కోసం పొలం వద్ద కట్టేసి వచ్చింది. మేత మేస్తున్న పాడి ఆవు కాలికి విద్యుత్ స్తంభంపై నుంచి బోరు మోటారుకు వచ్చే కరెంట్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికిగురై మృతి చెందింది.

కాలం చెల్లిన విత్తనాలు సీజ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మునిగడప గ్రామంలో ఆదిత్య ఫర్టిలైజర్ దుకాణంలో ఎస్ఐ చంద్రమోహన్ తనిఖీలు చేపట్టారు. సోమవారం దుకాణంలో చేపట్టిన తనిఖీల్లో కాలం చెల్లిన మూడు వరి విత్తనాల బ్యాగులు, క్రిమిసంహారక మందులను గుర్తించి మండల వ్యవసాయ అధికారి వసంతరావుకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

అవార్డు ప్రదానం

మిరుదొడ్డి(దుబ్బాక): ఇంటికొక స్పీకర్.. ఊరికొక ట్రైనర్ అన్న నినాదంతో ప్రతీ ఒక్కరిని చైతన్య పరుస్తున్న మండల పరిధిలోని మల్లుపల్లికి చెందిన ప్రకృతి ఎంటర్ ట్రైనరీ లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ పూడూరి నరేష్‌కు బెస్ట్ ట్రైనర్ అవార్డు లభించింది. ఇంపాక్ట్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైన్ ది ట్రైనర్ వర్క్ షాపులో నరేష్ అత్యుత్తమ ట్రైనర్‌గా ఎంపికయ్యారు. సోమవారం నల్లగొండలో జరిగిన కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ మెంబర్ పీఎంజేఎఫ్ మదన్‌మోహన్ అవార్డు అందజేశారు.

ఆదమరిస్తే అంతే

రోడ్లపై ప్రమాదకరంగా స్తంభాలు

సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు, అధికారులు మధ్య సమన్వయ లోపంతో వాహనదారుల సహనానికి పరీక్షగా మారుతోంది. నిర్మాణ సమయంలో కరెంటు స్తంభాలు తొలగించకపోవడంతో రోడ్లపైకి వచ్చాయి. ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

- పట్టించుకోని అధికారులు
- తొలగించాలంటున్న వాహనదారులు



పాత బస్టాండ్ రోడ్డులో ప్రమాదకరంగా కరెంటు స్తంభాలు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సుమారు రూ.2.90 కోట్లతో కిలోమీటర్ మేర సీసీ రోడ్డు నిర్మించారు. నిర్మాణ సమయంలో రోడ్డుకు అడ్డుగా ఉన్న కరెంటు స్తంభాలను తొలగించాలన్న ఆలోచన లేకుండా రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం అవి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

మిరుదొడ్డి మీదుగా గజ్వేల్, సికింద్రాబాద్, సిద్దిపేట, దుబ్బాక వంటి పట్టణాలకు నిత్యం వందల సంఖ్యలో ఈ రోడ్డు గుండా వాహనాలు వెళ్తుంటాయి. పాత బస్టాండ్, ఐకేపీ వెలుగు కార్యాలయం ఎదురుగా, పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్లపై కరెంటు స్తంభాలు దర్శనమిస్తున్నాయి. రోడ్డు అంచున ఉన్న ఈ కరెంటు స్తంభాలతో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలువురు ఈ స్తంభాల ఢీకొని ఆసుపత్రుల పాలైన సంఘటనలు ఉన్నాయి. వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చే వారికి ప్రమాదకరంగా మారిన కరెంటు స్తంభాలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. స్తంభాలను తొలగించాలని గతంలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదరంగా ఉన్న కరెంటు స్తంభాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఐకేపీ భవనం ఎదురుగా ఇలా..



పోలీస్‌స్టేషన్ వద్ద అలా...

స్తంభాలను తొలగించండి



సీసీ రోడ్ల అంచులో ఉన్న కరెంటు స్తంభాలను వెంటనే తొలగించాలి. ఈ కరెంటు స్తంభాలను ఢీకొన్న వాహనదారులు గాయపడి ఆసుపత్రుల్లో చేరాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి కరెంటు స్తంభాలను తొలగించేలా చర్యలు చేపట్టాలి.

– జిగిరి అమర్, కొండాపూర్

త్వరలోనే తొలగిస్తాం



రోడ్లపై ఉన్న కరెంటు స్తంభాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబూషన్ నిధులు ఇంకా మంజూరు విడుదల కాలేదు. దీంతో తొలగించడంలో జాప్యం జరుగుతోంది. నిధులు మంజూరైన వెంటనే మరో 15 కరెంటు స్తంభాలను తెప్పించి, రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయిస్తాం.

– శ్రీకాంత్, విద్యుత్ ఏఈ, మిరుదొడ్డి

జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కోహెడలో నివాళులర్పిస్తున్న రాజు

హుస్నాబాద్: దేశం కోసం ఎంతో సేవచేస్తున్నది నెహ్రూ కుటుంబం అని టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి అన్నారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ భారత రాజ్యాంగంలో ప్రజలకు ఎన్నో హక్కులు కల్పించడానికి కృషి చేశారన్నారు. దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక, విద్యా, సాగునీటి ప్రాజెక్టు రంగాల్లో అభివృద్ధి చెందడానికి పంచవర్ష ప్రణాళికలు ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చందు, కౌన్సిలర్లు వల్లపు రాజు, పున్న లావణ్య సది, నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆవరణలో..

కోహెడ(హుస్నాబాద్): జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు సోమవారం గ్రంథాలయం ఆవరణలో నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలయ్య, రాజు, అశోక్‌కుమార్, రమేశ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి 49వ బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విశ్వనాథశర్మ, ఆలయ వ్యవస్థాపకుడు నగేష్ విష్ణు, భక్తులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామి

మీ గత మిత్రుడే మా అభ్యర్థి

బీజేపీ నాయకులతో పల్లా ఆసక్తికర వ్యాఖ్యలు

మద్దూరు(హుస్నాబాద్): గతంలో మీ పార్టీలో పనిచేసిన మీ మిత్రుడే, నేడు మా పార్టీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అని, మీ మద్దతు తమకే ఉండాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీజేపీ నాయకులతో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలల్లో భాగంగా సోమవారం మద్దూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేష్‌గౌడ్, ఎమ్మెల్యే పల్లా సంభాషణను అక్కడే ఉన్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆసక్తిగా గమనించారు.



బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి

పంచాయతీ సిబ్బంది వేతనాలు చెల్లించండి

సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్

దుబ్బాక టౌన్: దౌల్తాబాద్ మండల పరిధిలో వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బంది వేతనాలు మూడు నుంచి తొమ్మిది నెలల వరకు పెండింగ్‌లో ఉండటం విచారకమని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ అన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలంటూ సోమవారం దౌల్తాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడారు. సిబ్బందిపై అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు పెరుగుతున్నాయని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్ విధానం జీఓ నంబర్ 51ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సిబ్బందికి నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు బాల్‌రాజ్, నాగరాజు, మల్లేశం, కిషన్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ప్రశాంతంగా 'ఎమ్మెల్సీ' పోలింగ్

కొముురవెల్లి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్)/చేర్యాల(సిద్దిపేట): ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. కొముురవెల్లి మండలంలో 86.58 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే మద్దూరులో 78.40, దూల్మిట్టలో 79.84 శాతం నమోదైంది. జనగామ నియోజకవర్గ పరిధిలోని చేర్యాలలో 71.78 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. బ్యాలెట్ పేపర్లో ఎక్కువ మంది అభ్యర్థులు ఉండటంతో ఓటర్లు సాయంత్రం వరకు క్యూలైన్లో వేచి ఉండాల్సి వచ్చింది. పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ వేర్వేరుగా సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.



కొముురవెల్లిలో ఓటువేసిన ఎంపీపీ కీర్తన



దూల్మిట్టలో పసిపాపతో వస్తున్న మహిళ



మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి దంపతులు



ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న పట్టభద్రులు

ప్రమాదకరమైన చెట్లను తొలగించాలి

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్లను తొలగించాలని కౌన్సిలర్లు సోమవారం మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడారు. సిద్దిపేటలో వర్షం కురిస్తే చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లను తాకంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. వైర్ల కింద గతంలో మొక్కలు నాటడం వల్లే ప్రస్తుతం ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అదేవిధంగా కొనో కార్పస్ చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. రూ.కోట్లు వెచ్చించి అనాలోచితంగా మొక్కలు నాటారని ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీదేవి, బాల్ లక్ష్మీ, రియాజ్, నాయకులు వేణుగోపాల్, ఆనంద్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

హద్దురాళ్ల తొలగింపు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడ శివారులో అక్రమంగా వెలిసిన వెంచర్లపై అధికారులు కొరడా ఝులిపించారు. సోమవారం మధ్యాహ్నం రాజీవ్ రహదారికి ఆనుకొని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇటీవల రెండు ఎకరాల్లో అక్రమంగా వెంచర్ చేసి ప్లాట్లు వేశారు. ఇందులో కొన్ని ప్లాట్లను విక్రయించారు. నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవాలని పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులు నిర్వాహకులకు నోటీసులు పంపినా స్పందించ లేదు. దీంతో వెంచర్‌లోని హద్దురాళ్లను తొలగించి ట్రాక్టరులో పంచాయతీకి తరలించినట్లు కార్యదర్శి చక్రపాణి తెలిపారు. ప్లాట్లను కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేవా తెలుసుకోవాలని కోరారు. రెండు మూడు రోజుల్లో దుద్దెడలోని అక్రమ వెంచర్ల హద్దురాళ్లను తొలిగిస్తామని కార్యదర్శి తెలిపారు.

స్వయం ఉపాధి పొందాలి

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఈజీఎస్ ఏపీడీ సతీష్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ ఐకేపీ, యూనియన్ బ్యాంక్ గ్రామీణ శిక్షణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉన్నతి కార్యక్రమంలో మగ్గం వర్క్ శిక్షణ తరగతులు ప్రారంభించారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

సిద్దిపేట కమాన్: మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ హెచ్చరించారు. సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు మైనర్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్‌లేని, నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్‌లేని వాహనదారులు, మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు రవాణ శాఖ ఉత్తర్వుల మేరకు వాహనాలకు నంబర్ ప్లేట్ బిగించుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, త్రిపుల్ రైడింగ్ చేయకూడదన్నారు. మైనర్ డ్రైవింగ్‌పై ఇప్పటి వరకు 554 కేసులు, నంబర్ ప్లేట్‌లేని వాహనాలపై 628 కేసులు, 2,510 త్రిపుల్ రైడింగ్ కేసులు, సెల్ ఫోన్ డ్రైవింగ్‌పై 2,200 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నంబర్ ప్లేటులేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. తరచుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాల తనిఖీ చేపడతామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వినయ్‌సాగర్, ఏఎస్ఐ ఉమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విత్తన షాపుల్లో తనిఖీలు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులోని విత్తనాల షాపులు, పురుగు మందుల షాపుల్లో సోమవారం ఎస్ఐ బాలకృష్ణ, మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, విత్తనాలు, పురుగుల మందులు బస్తాలను పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ నకిలీవి, కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే ..

దుబ్బాకటౌన్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని దుబ్బాక సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. దుబ్బాక ఎస్ఐ గంగరాజు, వ్యవసాయ అధికారులతో కలిసి సోమవారం దుబ్బాకలో ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుద్దెడలో..

కొండపాక(గజ్వేల్): నకిలీ మందులు, విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ హెచ్చరించారు. మండల పరిధిలోని దుద్దెడలోగల ఎరువుల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నకిలీ ఎరువులు, మందులు విక్రయించొద్దన్నారు. అమ్మకం, స్టాక్ వివరాలను నోటీస్ బోర్డులో పెట్టాలన్నారు.

డిమాండ్ చేయొద్దు..

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఒకేరకమైన విత్తనాలను రైతులు డిమాండ్ చేయొద్దని ఏఓ వసంతరావు అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో వివిధ రకాల విత్తనాలు ఉన్నాయని, విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రశీదు తీసుకోవాలన్నారు.



దుద్దెడలో ఎరువుల దుకాణంలో క్రయవిక్రయాల వివరాలను తెలుసుకుంటున్న సీఐ విద్యాసాగర్

అనుమతి ఉన్న దుకాణాల్లో..

ములుగు(గజ్వేల్): లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని ములుగు మండల ఏఈఓ పృథ్వీరాజ్ అన్నారు. మండల పరిధిలోని అల్లీనగర్, బండ నర్సంపల్లి, కొట్యాల గ్రామాల్లో సోమవారం విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్యాకింగ్ లేని విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సెంట్రల్ లైటింగ్ నిర్వహణలో నిర్లక్ష్యం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ నిర్వహణలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి బొనగిరి రూపేష్ ఆరోపించారు. బెజ్జంకిలో సోమవారం సీపీఐ నాయకులు సెంట్రల్ లైటింగ్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎడ్ల బొమ్మ నుంచి బస్టాండ్ వరకు నిర్మించిన సెంట్రల్ లైటింగ్ పోల్స్ వద్ద పలుచోట్ల వైరుతేలి ప్రమాదకరంగా ఉందన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని కొత్త వారిని నియమించాలని డిమాండ్ చేశారు.

◆ కొనుగోలు రశీదు తీసుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): విత్తన ప్యాకెట్లు కొనుగోలు చేసిన రైతులు రశీదు తీసుకోవాలని ఏఈఓలు సూచించారు. సోమవారం నంగునూరు మండలంలోని ఎనమిది క్లస్టర్ల పరిధిలోని రైతులకు విత్తన కొనుగోలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యావసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఓలు మాట్లాడుతూ వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన డీలర్ వద్ద లేబల్ సరిగా ఉన్న ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు మీరాబాయి, సాయివర్మ, కవిత, అశోక్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

◆ రమాబాయి జీవితం స్ఫూర్తిదాయకం

సిద్దిపేటకమాన్: మాత రమాబాయి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు అన్నారు. రమాబాయి వర్ధంతి కార్యక్రమాన్ని సిద్దిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ రమాబాయి అంబేడ్కర్ త్యాగపూరిత జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రాముునిపట్ల గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ 8వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం రెండో రోజు ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టకు ధ్వనిపోయడం, పుట్ట బంగారు తీసుకురావడం వంటి కార్యక్రమాలు జరిగాయి. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కేఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్‌రావు పూజలు చేశారు. గౌడ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ మహా అన్నదానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రంగధాంపల్లి హనుమాన్ ఆలయంలో మహాన్నదాన కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం సిద్దిపేట రంగధాంపల్లి హనుమాన్ ఆలయంలో 500 మందికి భిక్ష ఏర్పాటు చేశారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు హనుమాన్, శ్రీరామ నామస్మరణతో మారుమోగాయి.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామంలో సోమవారం మాజీ సర్పంచ్ తరాల లత హనుమాన్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్ఞానం కోసం పిల్లలు బడికి, మానసిక ప్రశాంతత కోసం పెద్దలు దేవాలయానికి వెళ్తారన్నారు. ఆంజనేయ స్వామి దీక్ష చేపడితే ఏకగ్రాత, పట్టుదల పెరుగుతుందన్నారు.

◆ వరి కొయ్యలను కాల్చొద్దు

బెజ్జంకి(సిద్దిపేట): పొలాల్లో వరి కొయ్యలను కాల్చొద్దని వ్యవసాయ అధికారులు సూచించారు. మండలంలోని దాచారం, ముత్తన్నపేట, రేగులపల్లె, కల్లెపెల్లి, బేగంపేట, లక్ష్మీపూర్ గ్రామాల్లో సోమవారం రైతులతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కొయ్యలను కాల్చడంవల్ల మిత్ర జీవులు చనిపోతాయన్నారు. వేసవిలో దుక్కులు చేస్తే మొగి పురుగు ఉధృతి అరికట్టొచ్చన్నారు.

◆ పర్యావరణ పరిరక్షణ అవగాహన యాత్ర

జగదేవ్‌పూర్(గజ్వేల్): పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడానికి మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు సైకిల్ యాత్ర ప్రారంభించాడు. శివకోటి ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తి చేశాడు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్న సంకల్పంతో సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలకు పర్యావరణ పరిరక్షణకుపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతీఒకరూ పర్యావరణ పరిరక్షణకు కాపాడాలని కోరారు. శివకోటిని గ్రామస్తులు అభినందిస్తూ జెండాఊపి యాత్రను ప్రారంభించారు.

◆ నిబంధనల ప్రకారం నిర్వహించాలి

రాయికోడ్(అందోల్): ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫర్టిలైజర్స్ దుకాణాలను నడపాలని మండల ఏఓ అభినాష్ వర్మ దుకాణాల యజమానులను అన్నారు. మండలంలోని చిమ్నాపూర్, రాయికోడ్ గ్రామాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణాల నిర్వహణ, రైతులకు అందించాల్సిన సేవలను వివరించారు. రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.